
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5




శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శుక్రవారం 15 మార్చి 2024

ఈబీసీ నేస్తం సొమ్ము విడుదల

పుట్టపర్తి, మార్చి 14: జిల్లావ్యాప్తంగా 17,953 మంది మహిళా లబ్ధిదారులకు ఈబీసీ నేస్తం కింద రూ.26.93 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన మెగా చెక్కును స్థానిక కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ అరుణ్‌బాబు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు మధ్య వయసు ఉండి ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల మహిళల జీవనోపాధి మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ఈ సాయం అందించిందన్నారు. ఏడాదికి రూ15వేలు చొప్పున ప్రభుత్వం అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి నిర్మలాజ్యోతి, సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.

మహిళకు పట్టం



టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి జాబితా విడుదల

కదిరిలో కందికుంట యశోదాదేవి..
పుట్టపర్తిలో పల్లె సింధూరారెడ్డికి చాన్స్
పార్లమెంటు పరిధిలో ఏడింట నాలుగుచోట్ల మహిళా అభ్యర్థులే
ఆ ఒక్కటిపై ఉత్కంఠ..

పుట్టపర్తి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి మహిళలకు పట్టం కట్టింది. సార్వత్రిక ఎన్నికల్లో శాసనసభ స్థానాలకు సంబంధించి వారికే ఎక్కువగా అవకాశం ఇచ్చింది. కూటమి గురువారం ప్రకటించిన జాబితాలో పుట్టపర్తి నుంచి పల్లె సింధూరారెడ్డి, కదిరి నుంచి బీసీ వర్గానికి చెందిన కందికుంట యశోదాదేవిని ఖరారు చేసింది. దీంతో పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలుండగా.. ఏకంగా నలుగురు మహిళా అభ్యర్థులను బరిలో నిలిపినట్లయింది. మహిళా ప్రాతినిధ్యంపై చర్చ నడుస్తోంది. తాజాగా టీడీపీ రెండో జాబితాలో విధేయతకే పట్టం కట్టింది. గతనెల 24న టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాలోనే హిందూపురం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, రాప్తాడు నుంచి పరిటాల సునీత, పెనుకొండ నుంచి సవిత, మడకశిర ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి దంతవైద్యుడు సునీల్‌కుమార్‌ను ఖరారు చేసిన సంగతి తెలిసిందే. తొలి జాబితాలోనే నాలుగు స్థానాల్లో టీడీపీ అభ్యర్థుల ఖరారుతో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నుంచి ఎవరిని ఎంపిక చేస్తారన్న ఉత్కంఠకు తెరలేచింది. తాజాగా పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాలకు రెండో జాబితాలో టీడీపీ అభ్యర్థులను ఖరారు చేయడంతో ఉత్కంఠకు తెరపడింది. హిందూపురం పార్లమెంటు పరిధిలో ధర్మవరం మినహా ఆరుచోట్ల టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల ఖరారుతో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నిండింది. జిల్లాలో టీడీపీ తొలి, రెండో జాబితాల్లో గెలుపు గుర్రాలకే చోటు ఇచ్చారన్న చర్చ సాగుతోంది. ఆరు స్థానాలకు టీడీపీ అభ్యర్థుల ఖరారుతో మిగిలిన ధర్మవరంపై ఉత్కంఠ నెలకొంది.



విధేయతకు పట్టం

టీడీపీ రెండో బాబితాలో మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదాదేవిని కదిరి నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దించడంతో విధేయతకు పట్టం కట్టినట్లు స్పష్టమైంది. రెండు దశాబ్దాలకుపైగా కదిరిలో కందికుంట వెంకటప్రసాద్ పార్టీని నడిపిస్తున్నారు. ఈసారీ ఆయనే బరిలో ఉంటారని అందరూ భావించినా టీడీపీ అధిష్ఠానం మాత్రం ఆయన సతీమణిని అభ్యర్థిగా ఖరారు చేసింది. పుట్టపర్తిలో సుదీర్ఘకాలంగా టీడీపీ కోసం పనిచేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి కోడలు పల్లె సింధూరా రెడ్డిని పోటీలో నిలిపారు. పల్లె రఘునాథ రెడ్డి నల్లమాడ, పుట్టపర్తి నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మంత్రిగా, ప్రభుత్వ చీఫ్‌విప్‌గా పనిచేశారు. ఉన్నత విద్యావంతురాలైన ఆయన కోడలు సింధూరారెడ్డిని టీడీపీ ఖరారు చేసింది. దీనిని బట్టి చూస్తే టీడీపీ విధేయతకు పట్టం కట్టిందన్న చర్చ సాగుతోంది. రెండో జాబితాలో ఖరారు చేసిన పల్లె సింధూరా రెడ్డి, కందికుంట యశోదాదేవి ఉన్నత విద్యావంతులు కావడంతో దీటైన అభ్యర్థులను ఎంపిక చేశారనడంలో సందేహం లేదు.

ఆమెదే పైచేయి

టీడీపీ అధిష్ఠానం పార్లమెంటు పరిధిలో నలుగురు మహిళలను గెలుపు గుర్రాలుగా బరిలోకి దించింది. మొదటి జాబితాలో రాప్తాడు నుంచి పరిటాల సునీత, పెనుకొండ నుంచి సవితను ఎంపిక చేసింది. రెండో బాబితాలో కదిరి నుంచి కందికుంట యశోదాదేవి, పుట్టపర్తి నుంచి పల్లె సింధూరారెడ్డిని ఖరారు చేసింది. ఇలా హిందూపురం పార్లమెంటు పరిధిలోని ఏడు స్థానాల్లో టీడీపీ నుంచి నలుగురు మహిళా అభ్యర్థులను పోటీలో నిలపడం ఇదే ప్రథమమనీ, తెలుగుదేశం మహిళా ప్రాతినిధ్యాన్ని ప్రోత్సహిస్తోందన్న చర్చలు వినిపిస్తున్నాయి. జిల్లాలో టీడీపీ ఖరారు చేసిన అభ్యర్థుల్లో 34 ఏళ్ల అతిచిన్న వయస్కురాలిగా పుట్టపర్తి నుంచి బరిలో దిగిన పల్లె సంధూరా రెడ్డి ఉన్నారు. అధికార వైసీపీ సమన్వయకర్తల పేరుతో హిందూపురం పార్లమెంటుతోపాటు మడకశిర, పెనుకొండ, కదిరి హిందూపురం నియోజకవర్గాలకు జాబితాను విడుదల చేసింది. పుట్టపర్తి, రాప్తాడు, ధర్మవరం ఎవరన్నది ఇంకా ఖరారు చేయలేదు. పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాల్లో మాత్రమే మహిళలను నియమించారు. టీడీపీ నలుగురిని అభ్యర్థులుగా ఖరారు చేసింది. ఈనేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో గెలుపుపై ధీమా నెలకొంది.

కందికుంట యశోదాదేవి బయోడేటా
పేరు : కందికుంట యశోదాదేవి
పుట్టిన తేదీ : 1968 ఫిబ్రవరి 1
జన్మస్థలం : కదిరి
తల్లిదండ్రులు : బాలయ్య, మంగమ్మ
చదువు : బీఏ
భర్త : కందికుంట వెంకటప్రసాద్
ప్రస్తుతం: కందికుంట నారాయణమ్మ మెమోరియల్ ట్రస్టు అధ్యక్షురాలు

పల్లె సింధూరారెడ్డి బయోడేటా..
పేరు: పల్లె సింధూరారెడ్డి
పుట్టిన తేదీ: 1990 ఆగస్టు 2న
తండ్రి: నారెడ్ల శంకర్‌రెడ్డి, కేరళ రిటైర్డ్ డీజీపీ
తల్లి: నారెడ్ల సౌభాగ్యరాణి
స్వస్థలం: అనంతపురం
విద్యాభ్యాసం: కేరళ
విద్యార్హత: ఎంటెక్
భర్త పేరు: పల్లె వెంకట క్రిష్ణకిశోర్‌రెడ్డి
పిల్లలు: కుమారుడు, కుమార్తె (కవలలు)
ప్రస్తుతం: బాలాజీ విద్యాసంస్థల డైరెక్టర్

మరో పది పోలింగ్ కేంద్రాలు



పుట్టపర్తి, మార్చి 14: జిల్లాలో పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తంగా 10 పోలింగ్ కేంద్రాలను పెంచారు. గతంలో 1561 పోలింగ్ కేంద్రాలుండగా.. ప్రస్తుతం 1571కి చేరాయి. ఓటర్ల సౌకర్యార్థం ఎన్నికల అధికారులు మరో పది పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. ఇందులో మడకశిర నియోజకవర్గంలో 117-ఏ విపాళ్యం, 123-ఏ రత్నగిరి, 134-ఏ ఆలూడి, 153-ఏ అగళి, పుట్టపర్తి నియోజకవర్గంలో 91-ఏ పుట్టపర్తి టౌన్, 102-ఏ జిల్లా కేంద్రంలోని ఎనుములపల్లి, 107-ఏ ప్రశాంతి గ్రామం, ధర్మవరం నియోజకవర్గంలో 30-ఏ ఎం.అగ్రహారం, 37-ఏ ఉప్పలపాడు, 168-ఏ ధర్మవరంలోని మార్కెట్‌యార్డు ప్రాంతంలో అదనంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అమ్మకానికి గ్రూప్-1 పోస్టులు

ప్రభుత్వంపై తెలుగు యువత నాయకుల ధ్వజం
కలెక్టరేట్ ముందు మోకాళ్లపై నిరసన

పుట్టపర్తి, మార్చి 14: రాష్ట్రంలో గ్రూప్-1 పోస్టులను ప్రభుత్వం సంతలో విక్రయానికి పెట్టిందని తెలుగు యువత నాయకులు మండిపడ్డారు. వారు గురువారం స్థానిక కలెక్టరేట్ వద్దకు చేరుకుని, మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తంచేశారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేశ్ మాట్లాడుతూ.. ఇటీవల గ్రూప్-1, డిప్యూటీ కలెక్టర్లు, డీఎస్పీ పోస్టుల ఎంపికలో అవినీతిని కోర్టు సైతం బహిర్గతం చేసిందన్నారు. ఆరునెలల్లోపు నియామకాల ప్రక్రియ పూర్తి చేయాలంటూ గతంలో ఇచ్చినవి చెల్లవంటూ హైకోర్టు తీర్పు ఇవ్వడం జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. నియామకాల్లో సైతం ఇలా అడ్డగోలుగా అవినీతికి పాల్పడడం వైసీపీ ప్రభుత్వ అవినీతికి అద్దం పడుతోందన్నారు. అరగంటపాటు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఓబుళరెడ్డి, నాయకులు మనోహర్, మురళీచౌదరి, బొల్లి సుధీర్, శివప్రసాద్ రెడ్డి, మహేష్‌రెడ్డి,మధుసూదన్‌రెడ్డి, బళ్లారి సుధాకర్, బద్రీనాథ్, సాయికుమార్ పాల్గొన్నారు.



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న తెలుగు యువత నాయకులు



	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.33 శుక్రవారం (సాయంత్రం)	5.05 శనివారం (ఉదయం)
కదిరి	6.30 శుక్రవారం (సాయంత్రం)	5.12 శనివారం (ఉదయం)
ధర్మవరం	6.35 శుక్రవారం (సాయంత్రం)	5.09 శనివారం (ఉదయం)
హిందూపురం	6.33 శుక్రవారం (సాయంత్రం)	5.13శనివారం (ఉదయం)
పెనుకొండ	6.31 శుక్రవారం (సాయంత్రం)	5.11 శనివారం (ఉదయం)

బిందుసేద్యంతో నీటి ఆదా

■ ఏడీ రత్నాచార్యులు



రైతులకు సూచనలిస్తున్న ఏడీ

తాడిమర్రి, మార్చి 14: పండ్లతోటలకు బిందు సేద్యం ద్వారా తడులిస్తే నీరు ఆదా అవుతుందని ఉద్యాన శాఖ కమిషనరేట్ సహాయ సంచాలకుడు (ఏడీ) రత్నాచార్యులు పేర్కొన్నారు. తద్వారా వేసవిలో నీటి వృథాను తగ్గించవచ్చన్నారు. మండలంలోని శివంపల్లి పరిధిలో గురువారం ఆయన పర్యటించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పండ్లతోటలకు వ్యాపిస్తున్న తెగుళ్ల, ఇతర మార్పుల గురించి రైతులకు పలు సూచనలు చేశారు. పండ్లతోటల్లో మల్చింగ్ చేయడం ద్వారా నీరు ఆవిరి కాకుండా తేమ ఎక్కువ రోజులు నిల్వ ఉంటుందన్నారు. కలుపు మందుల వినియోగం తగ్గించాలన్నారు. పచ్చిరొట్ట పైర్లపెంపకం ద్వారా కలుపు నివారించడమే కాకుండా నేల కూడా సారవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్, డీడీ వినోద్, హెచ్ఓ అమరేశ్వరి, వీహెచ్ఏలు గౌతమి, రామాంజనేయులు, చరిత పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోండి

పుట్టపర్తి రూరల్, మార్చి 14: కంటి సమస్యలున్నా, చూపు మందగించినా వెంటనే పరీక్షలు చేయించుకోవాలని జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ అనూరాధ సూచించారు. స్థానిక ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం గ్లకోమా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ కంటి గురించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కంటి సమస్యలున్నా, చూపుసరిగా కనబడకపోయినా, కంట్లో పొరలున్నా, (గ్లకోమా) నీటికాసులున్నా వెంటనే వైద్యులను సంప్రదించి, పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నగేష్, పీహెచ్ఎన్ లలితకుమారి, టీబీ సూపర్‌వైజర్లు అబిద్, రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.



పెనుకొండలో అసమ్మతి

మంత్రికి వ్యతిరేకంగా రహస్య సమావేశం

పెత్తందారులకు పనిచేయలేం..!

హిందూపురం, మార్చి 14: వంద కార్లతో రోజూ పల్లెల్లోకి వెళ్లి భయభ్రాంతులకు లోనుచేసే పెత్తందారులకు పనిచేయలేమంటూ పెనుకొండ నియోజకవర్గంలో అసమ్మతి నాయకులు గళం విప్పినట్లు తెలిసింది. మంత్రికి వ్యతిరేకంగా గురువారం సోమందేపల్లి మండలంలోని ఓ తోటలో ఐదు మండలాలకు చెందిన బలమైన, అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న రెండు సామాజికవర్గాలకు చెందిన వంద మంది వరకు రహస్యంగా సమావేశమైనట్లు తెలిసింది. దీనికి యువ నాయకుడితోపాటు ఓ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రాతినిధ్యం వహించినట్లు సమాచారం. సమావేశానికి హాజరైన వారు మాట్లాడుతూ.. మంత్రి ఉషశ్రీ పెనుకొండకు వచ్చినప్పటి నుంచి ఆమె చేస్తున్న హంగు, ఆర్భాటాలను వివరించినట్లు తెలిసింది. ఆమె ఒంటెత్తు పోకడలతో పనిచేస్తున్నారనీ, ఇలాగైతే కొనసాగితే పనిచేయాల్సిన అవసరం లేదంటూ ఓ సామాజికవర్గం నాయకులు ఖరాకండిగా చెప్పారు.

కొత్త నినాదం

'ఒకప్పుడు ఎమ్మెల్యే శంకరనారాయణ వద్దు.. కొత్తవారు ముద్దు..' అని నినాదాలు చేసిన నాయకులే ప్రస్తుతం ఉషశ్రీ వద్దు.. నియోజకవర్గాన్ని కాపాడుకుందామంటూ నినదించడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఐదేళ్లగా నష్టపోయిన వారంతా ప్రస్తుతం కూడా మంత్రికి వ్యతిరేకంగానే ఉన్నట్లు తెలిసింది. ఒకరిద్దరు నాయకులు మినహా మెజార్టీ వర్గం వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం దృష్టి సారించకపోతే తమ పరిస్థితి ఏమిటనీ, పార్టీ కోసం ఆవిర్భావం నుంచి పనిచేశామనీ, ఎవరో మధ్యలో వచ్చిన వ్యక్తులు అధికారాన్ని అనుభవిస్తున్నారని వాపోయినట్లు తెలిసింది. శంకర్‌నారాయణ వర్గమంతా మంత్రి వద్దకు చేరి తమపై లేనిపోని మాటలు చెప్పి ఇప్పటికే నష్టపోయిన వారిని గుర్తించలేదనీ, ఇలాగే అయితే తామెందుకంటూ ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. అధిష్ఠానం వెంటనే స్పందించకపోతే తాము పనిచేసేది లేదనీ, తామ దారి తాము చూసుకుంటామంటూ హెచ్చరించినట్లు సమాచారం.



వైసీపీ అసమ్మతి నాయకుల రహస్య సమావేశం జరిగింది ఇక్కడే..

కారు ఉన్న వారికే సమాచారం

పెనుకొండ నియోజకవర్గంలో పార్టీ ఆవిర్భావం నుంచి జెండా మోసిన వారికి ఇప్పటికీ ద్విచక్రవాహనాలే గతి అనీ, మరికొందరికి అవి కూడా లేవనీ, నియోజకవర్గానికి దిగుమతైన వలస పక్షి కారు ఉన్న వారికే సమాచారం ఇస్తున్నారంటూ రహస్య సమావేశంలో కొంత మంది నాయకులు ప్రశ్నించినట్లు తెలిసింది. కార్లతో ర్యాలీ చేస్తూ, డ్రోన్లతో వీడియోలు తీస్తే పార్టీకి ఎలాంటి లాభం ఉండదనీ, ఈ విషయాన్ని అధిష్ఠానం గుర్తించాలంటూ అసమ్మతి నాయకులు పేర్కొన్నట్లు తెలిసింది.

వంద కార్లతో ర్యాలీ ఏంటి?

వైసీపీ పేదల పార్టీ అంటున్నారనీ, ఎన్నికలప్పుడు ఓట్లు అడగడానికి వంద కార్లతో పల్లెల్లోకి వెళితే వారంతా భయభ్రాంతులకు లోనవుతున్నారని పలువురు పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో సామాన్యుల్లో పార్టీపై వ్యతిరేకత వస్తుందే తప్ప.. ఓట్లు రాలవని విశ్లేషించారట. పెనుకొండ చరిత్రలో ఇన్ని వాహనాల్లో వచ్చి ఓటు అడిగిన దాఖలాలు లేవనీ, ఇలాగే వెళితే పరిస్థితి ఏంటని అసమ్మతి నాయకులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

పది పరీక్షల ఏర్పాట్లు పూర్తి

■ డీఈఓ మీనాక్షి



కొత్తచెరువు, మార్చి 14: జిల్లావ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. స్థానిక డీఈఓ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ.. ఈనెల 18వ తేదీ నుంచి పది పరీక్షలు కొనసాగుతాయన్నారు. జిల్లావ్యాప్తంగా 439 పాఠశాలలకు చెందిన 27,555 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 22,002 మంది, ప్రైవేటు పాఠశాలల వారు 5,553 మంది ఉన్నారన్నారు. ఇందులో బాలురు 15,020 మంది, బాలికలు 12,535 మంది ఉన్నారన్నారు. జిల్లావ్యాప్తంగా 115 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వాటిలో ఇప్పటికే వసతులు సిద్ధం చేశామన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు 115 మంది, అడిషనల్ డిపార్ట్‌మెంటల్ అధికారులు 13 మంది, సిట్టింగ్ స్క్వాడ్ 60 మంది, ఫ్లయింగ్‌స్క్వాడ్ ఆరుగురిని నియమించామన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈఓ వివరించారు.

ఆ రెండింటిలో ఎవరో?



రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖరారు విషయంలో టీడీపీ అధిష్ఠానం ఆచితూచి అడుగేస్తోంది. గెలుపు గుర్రాలకే టికెట్లు ఇవ్వాలనే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఆరింటికి రెండు విడతల్లో అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన రెండు నియోజకవర్గాల్లోనే అభ్యర్థుల ఖరారు విషయంలో ఉత్కంఠ నెలకొంది. అందులో ఒకటి అనంతపురం అర్బన్ కాగా... రెండోది గుంతకల్లు నియోజకవర్గం. ఈ రెండు నియోజక వర్గాల్లో అభ్యర్థుల ఖరారు విషయంలో ఆశావహుల పేరుతో ఇప్పటికే ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టింది. ఆ సర్వేల్లో ఆశావహుల్లో ఎవరిని స్థానిక ఓటర్లు బలపరచారనేది పార్టీ అధిష్ఠానం బహిర్గతం చేయడం లేదు.

- అనంతపురం(ఆంధ్రజ్యోతి)

అభ్యర్థుల ఎంపికలో కొనసాగుతున్న ఉత్కంఠ

అర్బన్ సీటు కోసం జనసేన, టీడీపీలో తీవ్ర పోటీ

- జిల్లాలో ఆరు నియోజకవర్గాలకు టీడీపీ అభ్యర్థుల ఖరారు
- గుంతకల్లు, అనంత నియోజకవర్గాలకు ఇంకా ఖరారు కాని వైనం
- ఎంపీ అభ్యర్థిపైనా కొనసాగుతున్న ఉత్కంఠ
- ప్రచారంలోకి దిగిన ఆరు నియోజకవర్గాల అభ్యర్థులు





తొలుత అనంతపురం అర్బన్ నియోజకవర్గం జనసేనకు కేటాయించినట్లు ప్రచారం జరిగింది. ఆ మేరకు ఆ పార్టీ నుంచి జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్, రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, సీనియర్ నాయకులు కాయగూరల లక్ష్మీపతి అనంతపురం అర్బన్ టిక్కెట్ కోసం పోటీ పడ్డారు. జనసేన అధిష్ఠానం ఆ మేరకు ఐవీఆర్ఎస్ సర్వే చేయించింది. అనంతపురం అర్బన్ నుంచి టీడీపీ తరఫున టిక్కెట్ ఆశిస్తున్న ఆశావహులపైనా ఆ పార్టీ అధిష్ఠానం ఐవీఆర్ఎస్ సర్వే చేయించింది. మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి మరోసారి టిక్కెట్ ఆశిస్తున్నారు. ఆ పార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు కేఎం జకీవుల్లా, మహమ్మద్ గౌస్, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రహ్మణ్యం కుమారుడు ఎద్దులపల్లి లలిత్‌కృష్ణ, రాప్తాడు మాజీ ఎంపీపీ దగ్గుపాటి ప్రసాద్, ఆ పార్టీ నాయకుడు కొండవీటి సుధాకర్ నాయుడు సతీమణి భావన, ఎన్ఆర్ఐ ఎద్దులపల్లి నిర్మల అనంతపురం అర్బన్ టిక్కెట్ ఆశిస్తున్న వారిలో ఉన్నారు. గుంతకల్లు నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్, పత్తి హిమబిందు ఆ పార్టీ టిక్కెట్ ఆశిస్తున్నారు. అయితే అనూహ్యంగా వైసీపీ నుంచి మాజీమంత్రి గుమ్మనూరు జయరాం ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. గుంతకల్లు నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నారు. ఇలా ఎవరికి వారు టిక్కెట్ కోసం తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. గురువారం టీడీపీ అధిష్ఠానం 34 మంది అభ్యర్థులతో రెండో జాబితా విడుదల చేసింది. ఆ జాబితాలో ఈ రెండు నియోజకవర్గాల అభ్యర్థుల ప్రకటన లేకపోవడంతో ఆశావహులను మరింత టెన్షన్‌కు గురిచేస్తోంది. నేడోరేపో ఎన్నికల షెడ్యూల్ విడుదలవు తున్న నేపథ్యంలో ఆశావహులు ఎవరికి వారు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయించుకునేందుకు మంగళగిరిలోనే తిష్టవేయడం గమనార్హం.









ఎంపీ అభ్యర్థిపైనా కొనసాగుతున్న ఉత్కంఠ...



ఉమ్మడి అనంత జిల్లాలో అనంతపురం, హిందూపురం పార్లమెంటు స్థానాలకు కూటమి నుంచి టీడీపీ అభ్యర్థులే ఎన్నికల బరిలో దిగనున్నారు. ఎంపీ అభ్యర్థుల ఖరారు విషయంలోనూ ఉత్కంఠ కొనసాగుతోంది. మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథిని అనంతపురం ఎంపీ అభ్యర్థిగా ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే కొన్ని కారణాల నేపథ్యంలో ఆయన హిందూపురం ఎంపీగా పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలో అనంతపురం ఎంపీగా ఎవరు పోటీ చేస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఉమ్మడి జిల్లాలో కురుబ, బోయ సామాజికవర్గానికి రెండేసి సీట్లు ఇవ్వాలన్నది ఆ పార్టీ అధినాయకత్వం తీసుకున్న నిర్ణయం. ఆ మేరకు హిందూపురం పార్లమెంటు పరిధిలో ఒక అసెంబ్లీ, ఒక పార్లమెంటు, అనంతపురం పార్లమెంటు పరిధిలో ఒక అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానాన్ని కేటాయించాల్సి ఉంది. ఆ మేరకు ఇప్పటికే పెనుకొండ అసెంబ్లీ స్థానాన్ని కురబ సామాజికవర్గానికి చెందిన సవితకు కేటాయించారు. అనంతపురం పార్లమెంటు స్థానం నుంచి బీకే పార్థసారథి ఎంపీగా పోటీ చేస్తారని ఇప్పటికే ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. అయితే కొన్ని అనూహ్య పరిణామాల నేపథ్యంలో... అనంతపురం పార్లమెంటు నుంచి కాకుండా... హిందూపురం పార్లమెంటు నుంచి బీకే పార్థసారథి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఆ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఉమ్మడి జిల్లాలోని కొందరు ఆ పార్టీ ముఖ్య నాయకులు బీకే పార్థసారథి నిర్ణయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. పార్టీ అధిష్ఠానం దాన్ని ఆమోదిస్తే హిందూపురం పార్లమెంటు నుంచి బీకే పార్థసారథి ఎంపీగా పోటీ చేసేందుకు అడ్డంకి తొలగినట్లే. దీంతో కురుబ సామాజికవర్గం కోటా పూర్తయినట్లే.

అనంత ఎంపీ స్థానం నుంచి ఎవరో?

ఇక అనంతపురం పార్లమెంటు విషయానికొస్తే... ఎంపీ అభ్యర్థి ఎవరన్నదే ఇప్పటికీ తేలలేదు. బోయ సామాజికవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిని రంగంలోకి దింపాలని పార్టీ అధిష్ఠానం ఇప్పటికే కొందరి పేర్లతో ఐవీఆర్ఎస్ సర్వే చేయించింది. అయితే ఇప్పటికే రాయదుర్గం నుంచి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పోటీచేస్తారని అధిష్ఠానం ప్రకటించింది. గుంతకల్లు అసెంబ్లీ స్థానం నుంచి మాజీమంత్రి గుమ్మనూరు జయరాం పోటీ చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అక్కడి నుంచి గుమ్మనూరు జయరాంను అసెంబ్లీ అభ్యర్థిగా నిలిపితే... ఎంపీ అభ్యర్థిని ఏ సామాజి కవర్గం నుంచి రంగంలోకి దింపుతారనే చర్చ నడుస్తోంది. గుంతకల్లు నియోజకవర్గం నుంచి బోయ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని బరిలో నిలపని పక్షంలో... అనంతపురం పార్లమెంటు అభ్యర్థిగా ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే ఎంపీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఒకవేళ గుంతకల్లు నియోజకవర్గం నుంచి బోయ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని బరిలో నిలిపితే... మరో సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని పార్లమెంటు బరిలో నిలపనున్నట్లు సమాచారం.

ప్రచారంలో ఆ ఆరు నియోజకవర్గాల అభ్యర్థులు...



ఇప్పటికే టీడీపీ అధిష్ఠానం జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. దీంతో రాయదుర్గం నుంచి కాలవ శ్రీనివాసులు, రాప్తాడు నుంచి పరిటాల సునీత, ఉరవకొండ నుంచి పయ్యావుల కేశవ్, తాడిపత్రి నుంచి జేసీ అశ్మిత్ రెడ్డి, శింగనమల నుంచి బండారు శ్రావణిశ్రీ, కళ్యాణదుర్గం నుంచి అమిలినేని సురేంద్రబాబు వారి నియోజకవర్గాల్లో ప్రచారాలు ప్రారంభించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి తీసుకెళ్తున్నారు. వైసీపీ అరాచక పాలనను ప్రజల్లో ఎండగడుతూ టీడీపీని ఆశీర్వదించాలని ప్రచారాన్ని ఉధృతం చేస్తూ ముందుకు సాగుతున్నారు.

ఇంకా ఎన్నేళ్లు ఈ నిరీక్షణ ?

- 'రివర్స్'లోనూ ముందుకు సాగని టిడ్కో ఇళ్లు
- టీడీపీ మంజూరు చేసిన గృహాలు 50,900
- వైసీపీ కోతేసింది 34,628
- కట్టిస్తామని ప్రకటించిన ఇళ్లు 16,272
- ఐదేళ్లలో కట్టించింది 1024 మాత్రమే
- కట్టిన డిపాజిట్ వెనక్కురాక బాధితుల ఆందోళన
- ఎన్నికల నేపథ్యంలో తాడిపత్రిలో టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవం !



పామిడిలో టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు ఇలా...

అనంతపురం సిటీ, మార్చి 14: టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. గత టీడీపీ పాలనలో ఉమ్మడి జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మొత్తం 59 వేల మందికి ఇళ్లు ఇవ్వాలని రూ. వెయ్యి కోట్లతో పనులు ప్రారంభించారు. సుమారు రూ. 210 కోట్లు విలువ చేసే పనులు చకచక పూర్తయ్యాయి. అయితే 2019లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో నిర్మాణాలు అర్ధంతరం గా ఆగిపోయాయి. లబ్ధిదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో రివర్స్ టెండరింగ్ ద్వారా 16,272 ఇళ్లను మాత్రమే నిర్మించి ఇస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. మిగిలిన 34,628 మందికి చెందిన రూ.33 కోట్ల డిపాజిట్‌లను వెనక్కి ఇవ్వడంతో పాటు జగనన్న కాలనీల్లో ఇంటి పట్టా ఇస్తామని ప్రకటిం చింది. ఈ హామీ ఇచ్చి ఐదేళ్లు కావస్తున్నా అమలుకు నోచుకోకపోవడం విమర్శలకు తావి స్తోంది. 'రివర్స్' లో [illegible]

హడావుడి ప్రారంభోత్సవం

వైసీపీ ప్రభుత్వం 16,272 మంది లబ్ధిదారులకు ప్రకటించిన టిడ్కో ఇళ్లను కూడా ఈ ఐదేళ్ల కాలంలో కట్టించి ఇవ్వలేకపోయింది. టిడ్కో ఇళ్ల విషయంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే.. ఎక్కడా కూడా ఆశించిన స్థాయిలో పనులు జరగలేదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అనంతపురం నగరంతో పాటు తాడిపత్రి, ధర్మవరం మినహా ఇంకా ఎక్కడా నిర్మాణాలు జరగలేదని తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో పునాదులకే పరిమితమయ్యాయి. మరికొన్ని చోట్ల మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియ ముంచుకొస్తున్న నేపథ్యంలో ప్రజా వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుందని భావించిన ప్రభుత్వం హడావుడిగా తాడిపత్రిలో మంజూరు చేసిన 3008 ఇళ్లలో 1024 టిడ్కో ఇళ్లను ప్రారంభించింది. ఇందులో కూడా 350 మందికి మాత్రమే ఇంటి తాళాలు అందజేసి మమ అనిపించారనే విమర్శలు ఉన్నాయి. ఈ నిర్మాణాల్లో కూడా టీడీపీ హయాంలో చేసిన పనులే ఎక్కువని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16,272 ఇళ్లను పూర్తి చేయాల్సి ఉండగా..ఈ ఐదేళ్ల వ్యవధిలో కేవలం 1024 ఇళ్లు మాత్రమే పూర్తి చేసింది. ఇదంతా గమనిస్తే టిడ్కో ఇళ్ల విషయంలో వైసీపీ సర్కార్‌ది అంతా ఆర్భాటమేనన్న విషయం అర్థమవుతోంది.

టిడ్కో ఇళ్ల పనులు ముందుకు సాగడం లేదని లబ్ధిదారు లు వాపోతున్నారు.

● టీడీపీ మంజూరు చేస్తే.. వైసీపీ కోతేసింది...

గత టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారుల నుంచి నామమాత్రపు డిపాజిట్‌ల ద్వారా రూ. 1000 కోట్ల నిధులతో 59 వేల మందికి టిడ్కో ఇళ్లను మంజూరు చేసింది. అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 34,628 ఇళ్లను కోతేసింది. అంతటితో ఆగకుండా వారు చెల్లించిన రూ.33 కోట్ల డిపాజిట్‌లు వెంటనే చెల్లించి వారందరికి జగనన్న ఇంటి పట్టా ఇస్తామని సీఎం జగన్ హామీలు ఇచ్చారు. ఐదేళ్లు కావస్తున్నా.. మంజూరు చేసిన టిడ్కో ఇళ్లు కట్టిందీ లేదు.. లబ్ధిదారులకు డిపాజిట్‌లకు సొమ్ము ఒక్క పైసా చెల్లించిందీ లేదు. కనీసం జగనన్న ఇంటి పట్టా కూడా ఇవ్వకపోవడం బాధిత లబ్ధిదారులను కలవరపెడుతోంది. డిపాజిట్‌ల నగదు కోసం సంబంధిత అధికారులను అడిగితే.. అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారేకానీ.. న్యాయ చేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



గుత్తిలో టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు

● టిడ్కో ఇల్లు.. డిపాజిట్‌లు రాక...

ఎంతో ఆశగా డిపాజిట్‌లు చెల్లించిన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల విషయంలో నిరాశే ఎదురైంది. కనీసం చెల్లించిన నగదు కూడా వెనక్కు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. జగనన్న ఇంటి పట్టా కూడా ఇవ్వకపోవడం పట్ల బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా అటు టిడ్కో ఇల్లు రాక.. ఇటు చెల్లించినా డిపాజిట్ రాక బాధితులు ఆందోళన చెందుతున్నారు. పదే పదే కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదని పలువురు బాధితులు వాపోతున్నారు.



అనంతపురం నగర శివారులో టిడ్కో ఇళ్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల పరిస్థితి ఇలా...

- టీడీపీ హయాంలో మంజూరైన ఇళ్ల సంఖ్య : 50,900
- డిపాజిట్‌లు చెల్లించిన వారి సంఖ్య : 59,000
- వైసీపీ కోతేసిన టిడ్కో ఇళ్ల సంఖ్య : 34,628
- డిపాజిట్ వెనక్కి ఇవ్వాల్సిన వారి సంఖ్య : 34,628
- మొత్తం వెనక్కి చెల్లించాల్సిన సొమ్ము : రూ. 33 కోట్లు
- ఇప్పటికి పూర్తయినా టిడ్కో ఇళ్ల సంఖ్య : 1024
- ఇప్పటికి పెండింగ్‌లో : సుమారు 6వేలకు పైగానే...
- టీడీపీ హయాంలో ఖర్చు చేసిన వ్యయం : రూ. 210 కోట్లు
- వైసీపీ హయాంలో ఖర్చు చేసిన వ్యయం : రూ. 135 కోట్లు
- మొత్తంగా ఖర్చు చేసిన వ్యయం : 345 కోట్లు
- మొత్తం టిడ్కో ఇళ్ల ప్రాజెక్టు వ్యయం : రూ.వెయ్యి కోట్లు
- పెండింగ్ బిల్లులు : సుమారు రూ. 70 కోట్లు.

జిల్లా ఎన్నికల అధికారులు వీరే...

అనంతపేరం టౌన్, మార్చి 14: జిల్లా స్థాయిలో ఎన్నికలు నిర్వహించే అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా గురువారం ప్రకటించారు. అనంత జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టరు గౌతమిని నియమించారు. అలాగే జిల్లా పరిధిలోని ఎనిమిది నియోజకవర్గాలకు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాయదుర్గం నియోజకవర్గానికి ఎస్. కరుణకుమారి,(ఆన్‌సెట్ సీఈఓ) ఉరవకొండకు కేతన్‌గార్గ్ (జాయింట్‌కలెక్టరు) గుంతకల్లుకు శ్రీనివాసులురెడ్డి (ఆర్డీఓ, గుంతకల్లు) తాడిపత్రికి రామభూపాల్‌రెడ్డి (ఎస్‌డీసీ, పీఏబీఆర్) శింగనమలకు శ్రీను వెన్నెల (ఎస్‌డీసీ, హెచ్ఎన్ఎస్ఎస్-2) అనంతపురంఅర్బన్‌కు గ్రంధి వెంకటేష్, (ఆర్డీఓ, అనంతపురం) కళ్యాణదుర్గంకు రాణిసుశ్మిత, (ఆర్డీఓ, కళ్యాణదుర్గం) రాప్తాడు నియోజకవర్గానికి వసంతబాబు (డిప్యూటీ కలెక్టరు, హెచ్చెల్సీ)లను నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసే వరకు వీరు ఈ జిల్లాలో ఎన్నికల అధికారులుగా వ్యవహరించనున్నారు.


సింధనూరు వరకు రైలు పొడిగింపు



రాయదుర్గం, మార్చి 14: యశ్వంత్‌పూర్ నుంచి కారటగి వరకు వెళ్లే 16545 నంబరు రైలును సింధనూరు వరకు పొడిగిస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం యశ్వంత్‌పూర్‌లో రాత్రి 8.25కు బయల్దేరి ఉదయం 4 గంటలకు రాయదుర్గంకు చేరుకుని 11 గంటలకు సింధనూరుకు చేరుకుంటుంది. అదే విధంగా 16546 నంబరు గల రైలు సింధనూరులో సాయంత్రం 5.30 గంటలకు బయల్దేరి రాయదుర్గంకు రాత్రి 11.40 గంటలకు చేరుకుని ఉదయం యశ్వంత్‌పూర్‌కు చేరుకుంటుంది. ముఖ్యంగా యశ్వంత్‌పూర్ నుండి కారటగి నుంచి నడిచే సేవలను 20 కి.మీ. పెంచి సింధనూరు వరకు పొడిగించారు.

సైనిక్ స్కూల్ పరీక్షల్లో ఆరో ర్యాంకు

ఆలిండియా స్థాయిలో మెరిసిన పునీత్‌రెడ్డి



రామగిరి, మార్చి 14: మండలంలోని శ్రీహరిపురం గ్రామానికి చెందిన పునీత్‌రెడ్డి సైనిక్ స్కూల్ అకాడమీ ఎంట్రన్స్‌లో ఆలిండియాలో ఆరో ర్యాంకు సాధించాడు. దక్షిణభారత దేశంలో ఐదు రాష్ట్రాలలో మొదటి స్థానం సాధించాడు. ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ఈ పరీక్షలో 300 మార్కులకు గాను 288 మార్కులు సాధించాడు. దీని పట్ల అతడి తల్లిదండ్రులు రజని, శంకర్‌రెడ్డి ఆనందం వ్యక్తంచేశారు.

ఎమ్మెల్సీ మాతృమూర్తికి సీఎం నివాళి

ఉరవకొండ, మార్చి 14: ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాతృమూర్తి లలితమ్మ భౌతిక కాయానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. వజ్రకరూరు మండలం, కొనకొండ్ల గ్రామానికి సీఎం జగన్ గురువారం మధ్యాహ్నం చేరుకున్నారు. ఎమ్మెల్సీ స్వగృహం వద్ద లలితమ్మ పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఆయన సోదరులు ఆదోని, మంత్రాలయం, గుంతకల్లు ఎమ్మెల్యేలు సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు సీతారామిరెడ్డిని , ఇతర కుటుంబ సభ్యులను సీఎం పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం అక్కడి నుంచి తాడేపల్లికి వెళ్లారు.



నివాళులర్పిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

పండ్లతోటల్లో బెట్ట పరిస్థితులపై అధ్యయనం

ఉమ్మడి జిల్లాలో నాలుగు బృందాల పర్యటన

అనంతపురం అర్బన్, మార్చి 14: పండ్ల తోటల్లో బెట్ట పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు అనంత ఉమ్మడి జిల్లాలో ఉద్యాన, ఏపీఎంఐపీ రాష్ట్ర కార్యాలయాల ప్రత్యేక బృందాలు పర్యటించాయి. ఏపీఎంఐపీ ఓఎస్‌డీలు వెంకటేశ్వర్లు, రమేష్, ఉద్యాన శాఖ కమిషనరేట్ అధికారులు వెంకటరావు, రత్నచార్యుల నేతృత్వంలో నాలుగు బృందాలు అనంత ఉమ్మడి జిల్లాలోని 9 మండలాల్లో పర్యటించాయి. గురువారం ఒకటో బృందం సభ్యులు కూడేరు, గార్లదిన్నె, రెండో బృందం నార్పల, యల్లనూరు, పుట్లూరు, మూడో బృందం బత్తలపల్లి, తాడిమర్రి, నాలుగో బృందం నీకేపల్లి, కనగానపల్లి మండలాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో బెట్టపరిస్థితుల నేపథ్యంలో ముదురుతోటల్లో కొన్ని చెట్లు వేరుకుళ్లు సోకి చని పోతున్నట్లు గుర్తించారు. బెట్టపరిస్థితులను తట్టుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. చీనీ, దానిమ్మ, అరటి తదితర ఉద్యాన పంటలకు ఈక్రాప్ చేసుకున్న రైతులకు వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా (వాతావరణ ఆధారిత పంటల బీమా) అందుతుందన్నారు.



చీనీ చెట్లను పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం సభ్యులు

20,145 మందికి ఈబీసీ నేస్తం

కలెక్టర్ గౌతమి

అనంతపురం టౌన్, మార్చి 14: జిల్లాలో 20,145 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద ఆర్థిక సాయం మంజూరైనట్లు కలెక్టరు గౌతమి తెలిపారు. గురువారం సీఎం ఈ పథకం కింద లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు విడు దల చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా లబ్ధి దారులకు రూ.30.21కోట్లు చెక్‌ను కలెక్టరు చేతులు మీదుగా విడుదల చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభు త్వం 45 ఏళ్ల నుంచి 60ఏళ్ల లోపు మధ్య వయసు ఉండి ఆర్థికంగా వెనుక బడిన అగ్రవర్ణాల మహిళల జీవనోపాధి అవకా శాలు పెంచడం కోసం ఈసాయాన్ని అందిస్తోందన్నారు. ఏడాది కి రూ.15వేలు చొప్పన అందించే ఈ సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, నగరపాలక కమిషనర్ మేఘ స్వరూప్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ధరల చింత

- తగ్గిన చింతపండు ధర
- క్వింటానికి రూ.2 వేలు పడిపోయిన వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు

హిందూపురం, మార్చి 14: హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో చింతపండు ధర కొంత తగ్గింది. మార్కెట్ ప్రారంభం నుంచి ఆశించిన మేర ధరలు పలుకుతూ వచ్చాయి. మార్చిలో ధర మరింత పెరగాల్సి ఉండేది. అలాంటిది మార్చి రెండోవారంలోనే క్వింటాపై రూ. 1500 నుంచి రూ. 2వేలదాకా ధరలు తగ్గడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌కు జిల్లా నుంచే కాక కర్ణాటక నుంచి పెద్దఎత్తున చింతపండు వస్తోంది. ఇక్కడికి కర్పూలీ రకం ఎక్కువగా వస్తుంది. గురువారం మార్కెట్‌లో కర్పూలీ క్వింటా గరిష్ఠంగా రూ.30వేలు పలికింది. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌కు కర్పులీ, ఫ్లవర్, బోటురకం చింతపండు వస్తుంది. గురువారం మార్కెట్‌కు వచ్చిన మేలురకం కర్పూలీ క్వింటా రూ.30వేలు పలకగా రెండోరకం రూ.20వేలు, మూడో రకం 18వేలు పలికింది. ఫ్లవర్ క్వింటా రూ.16వేలు, రెండో రకం రూ.14వేలు, మూడో రకం రూ.10వేలు పలికింది. బోటురకం క్వింటా మొదటి రకం రూ.10వేలు, రెండో రకం రూ.5వేలు, మూడో రకం రూ.2600దాకా పలికినట్లు మార్కెట్‌వర్గాలు పేర్కొంటున్నాయి. గతంతో పోల్చుకుంటే కర్పూలీ క్వింటాల్‌పై రూ.2వేలు తగ్గిందని పేర్కొంటున్నారు.

బయట వ్యాపారులు రాలేదంటూ...

సాధారణంగా హిందూపురం వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌కు మార్చినెలలో బయటి నుంచి వ్యాపారులు వస్తారు. ఎందుకంటే మార్చి నుంచి ఏప్రిల్ 15లోపు చింతపండు నాణ్యతగా ఉంటుంది. ఈ సమయంలోనే ఎక్కువగా ఏసీలో నిల్వ ఉంచుతారు. అందుకోసం బయటి నుంచి వ్యాపారులు ఇక్కడికి చేరుకుని కొనుగోలు చేస్తారు. ఇందులో కొందరు స్థానికంగాను, మరికొంతమంది కర్నూలు, చిత్తూరు, తమిళనాడు ప్రాంతాల్లో నిల్వ చేసుకుంటుంటారు. అయితే ఈసారి ఎందుకో మార్చి రెండోవారంలో కూడా బయటి నుంచి వ్యాపారులు రాలేదు. దీనిని సాకుగా తీసుకుని స్థానిక వ్యాపారులు ధరలు తగ్గించినట్లు తెలుస్తోంది.

ఈ ఏడాది ఆలస్యంగా మార్కెట్ ప్రారంభం

ప్రతియేడాది జనవరి మాసంలో సంక్రాంతి పండగకే కొత్త చింతపండు మార్కెట్‌కు రావడంతో అదేరోజు మార్కెట్ ప్రారంభిస్తారు. ఈసారి జనవరి 20పైన మార్కెట్ ప్రారంభించారు. అయినా మార్చి మాసంలో ధరలు తగ్గడం వెనుక కారణాలు ఏంటని రైతులు ఆలోచనలో పడ్డారు. సాధారణంగా రైతులు జనవరి, ఫిబ్రవరి మాసంలో మార్కెట్‌కు పండు తీసుకొచ్చేందుకు సిద్ధమైనా మార్చి మాసంలో అమ్ముకుంటే మంచి ధర వస్తుందని భావిస్తుంటారు. గత ఏడాదికూడా చింతపండు ధరలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. అయితే సీజన్ లో కాకుండా కొంతమంది వ్యాపారులు, రైతులు, ఏసీ గోదాములో నిల్వ ఉంచుకున్న సరుకుకు జూలై, సెప్టెంబరు నెలల్లో అధిక ధరలకు అమ్ముకున్నారు.



పురం మార్కెట్‌లో చింతపండు దిగుబడులు

కూలి కూడా గిట్టదు

ప్రస్తుతం చింత చెట్టు నుంచి కాయ దులపాలంటే ఒక కూలీకి రూ.వెయ్యి ఇవ్వాలి. చింతకాయలు ఏరేందుకు రూ.400లు మహిళా కూలీకి ఇవ్వాలి. దులిపిన చింతకాయను పొట్టు ఊడదీసి కట్టికాయ చేసేందుకు కూలీకి రూ.600 ఇవ్వాలి. ఇక కట్టికాయని కర్పూలీ రకం చేసేందుకు కిలోకు రూ.25ఇవ్వాలి. ఇలా కూలీలను లెక్కిస్తే రైతుకుగాని, చింతమాను కొనుగోలుచేసిన వ్యాపారికి గాని మిగిలే పరిస్థితి లేదు. దీనికితోడు గత ఏడాది జూలై నుంచి డిసెంబరులోపు వర్షాలు పడకపోవడంతో దిగుబడి కూడా తగ్గుతూ వచ్చింది. మామూలుగా కొన్ని చింతచెట్ల నుంచి పది కేజీల కట్టికాయ కొడితే 6 నుంచి 7కేజీల కర్పూలీ రావాలి. ఈసారి 5కేజీల నుంచి 5.50కేజీలకు పడిపోయింది. ఈ లెక్కన పది కేజీల కట్టికాయకు రూ.250నుంచి రూ.350దాకా నష్టం వస్తోంది. ఇక మార్కెట్‌కు తీసుకొచ్చిన కూలీలు, కమిషన్‌లు లెక్కిస్తే పెద్దగా లాభం వచ్చేదిలేద రైతులు అంటున్నారు.

అంబరాన్నంటిన టీడీపీ శ్రేణుల సంబరాలు

● కందికుంట యశోదాదేవికి పార్టీ టిక్కెట్ ఇవ్వడంపై హర్షం


కదిరిలో కందికుంట యశోదాదేవికి స్వీటు తినిపిస్తున్న కార్యకర్తలు


ఎన్టీఆర్ కూడలిలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు

కదిరి, మార్చి 14: కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే టిక్కెట్ టీడీపీ అధిష్ఠానం కందికుంట యశోదాదేవికి ఇవ్వడంతో నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. కందికుంట వెంకటప్రసాద్ సతీమణి యశోదా దేవిని అభ్యర్థిగా ప్రకటించడంతో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ క్రమంలో గురువారం కదిరి పట్టణంలో అన్ని కూడళ్లలో బాణ సంచా కాల్చారు. తర్వాత కందికుంట ఇంటివద్దకు పెద్ద ఎత్తున చేరుకుని యశోదమ్మకు అభినందలు తెలిపి మిఠాయిలు తినిపించారు.

నంబులపూలకుంట: నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కందికుంట యశోదమ్మను ప్రకటించడంతో మండలకేంద్రంలోని పార్టీ శ్రేణులు స్థానిక నాగలకట్ట వద్ద ప్రత్యేక పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టారు. నాలుగు రోడ్లకూడలిలో బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు అంజనప్పనాయుడు, ప్రధాన కార్యదర్శి నరసింహులు, నాయకులు రెడ్డెప్ప, శ్రీరాములనాయుడు, వంకమద్ది రవి, క్రిట్టన్న, బాలాజీ, అజంతుల్లా, దండోరా రెడ్డెప్ప, రామిరెడ్డి, ఆది నారాయణాచారి, హనుమంతరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గంగాద్రి, రమేష్, చింతా శీనా, కార్యకర్తలు పాల్గొన్నారు.

తనకల్లు: కదిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కందికుంట యశోదాదేవి పేరును ఖరారు చేయడంతో మండలవ్యాప్తంగా టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నిండింది. మండలకేంద్రంతో పాటు కొక్కంటి క్రాస్, చీటికమానుపల్లి తదితర గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలు చేతపట్టుకుని నినాదాలు చేస్తూ హర్షం వ్యక్తం చేశారు. కొక్కంటి క్రాస్, తనకల్లు జాతీయ రహ దారిలో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి, నాయకులు తోట సరోజమ్మ, మహబూబ్‌బాషా, కర్రె సత్యం, బాలప్ప, రమణారడ్డి, శంకర్‌నాయుడు, మల్లెపూల రవి, ఫక్కీర్‌సాబ్, తోట కిషోర్, దామోదర్, దస్తగిరి, నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండలంలోని టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కందికుంట యశోదమ్మకు టీడీపీ టిక్కెట్ రావడంతో హర్షం వ్యక్తం చేస్తూ నాలుగు రోడ్ల కూడలిలో మండల కన్వీనర్ కొండయ్య ఆధ్వర్యంలో పెద్దఎత్తున బాణసంచా కాల్చి మితాలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. పలువురు వైసీపీ శ్రేణులు నాయకుల ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, నాయకులు అక్రమ్ బాషా, చంద్ర, రవి, మునాఫ్, రంగస్వామి రెడ్డి, తాజుద్దీన్, కాకార్ల రవీంద్రరెడ్డి, రవికుమార్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


నంబులపూలకుంటలో బాణసంచా కాల్చుతున్న టీడీపీ నాయకులు


తనకల్లులో..


గాండ్లపెంటలో టీడీపీ శ్రేణుల సంబరాలు

పల్లె సింధూరకు టిక్కెట్ కేటాయింపుపై హర్షం

● పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ శ్రేణుల సంబరాలు


కొత్తచెరువులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాల్లో టీడీపీ శ్రేణులు

కొత్తచెరువు, మార్చి 14: పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే టిక్కెట్ పల్లె సింధూరారెడ్డికి అధిష్ఠానం కేటాయించడంతో నియోజకవర్గవ్యాప్తంగా గురువారం సంబరాలు అంబరాన్నంటాయి. కొత్తచెరువు మండల కేంద్రంలో నాయకులు,కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి కోడలు పల్లె సింధూరారెడ్డికి టికెట్‌ను కేటాయించినందుకు టీడీపీ అధినేత చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఆమె గెలుపునకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 7గంటలకు మండలంలోని కొడపగానిపల్లి సమీపంలో ఆర్చ్‌వద్ద పల్లెసింధూరారెడ్డికి స్వాగతకార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

ఓబుళదేవరచెరువు: పల్లె సింధూరకు టీడీపీ టిక్కెట్ రావడంపై మండల వ్యాప్తంగా పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో మండలకన్వీనర్ శెట్టివారి జయచంద్ర ఆధ్వర్యంలో కదిరి, హిందూపురం ప్రధాన రహదారిపై బాణసంచా కాల్చారు. అనంతరం మిఠాయిలు పంచారు. కొండక మర్లలోనూ ఆర్ ఎంపీ జాకీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు.

నల్లమాడ: పుట్టపర్తి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా పల్లె సింధూర పేరును ప్రకటించడంపై మండల వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలోని సత్యమ్మకు ప్రత్యేక పూజలు చేసి, టెంకాయలు సమర్పించారు. అనంతరం బస్టాండ్ కూడలి, వైఎస్ఆర్ సర్కిల్‌లో బాణసంచా కాల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో మండలకన్వీనర్ మైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, నాయకులు బుట్టి నాగభూషణనాయుడు, గడ్డం రమణారెడ్డి, మైలే రామచంద్ర, మంజునాథ్‌రెడ్డి, రాజారెడ్డి, పుట్ల రవీంద్ర, పాపారాయుడు, చంద్రారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుక్కపట్నం: మండలకేంద్రంలోని టీడీపీ శ్రేణులు తేరుకూడలి నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళుర్పించారు. అనంతరం బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి కోడలు పల్లె సింధూరరెడ్డి టిక్కెట్ కేటాయించడంపై చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, నాయకులు గోపాలపురం గంగాధర్, జంగం వెంకటరాముడు, లావణ్యగౌడ్, కరణం శ్రీరాములు, రామక్రిష్ణ, కేశవరాయుడు,సతీష్ రాయల్, వాజీద్, బాలు, మంజు, సూరి, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


ఓడీసీలో స్వీట్లు తినిపించుకుంటున్న తెలుగుతమ్ముళ్లు


బుక్కపట్నంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి

రేపటి నుంచి సూర్యపూజ మహోత్సవం

ధర్మవరం, మార్చి 14: పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మూడు రోజుల పాటు సూర్యపూజ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు రోజులు ఉదయాన్నే అర్చకులు ఆలయంలోని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారన్నారు. సూర్యభగవానుడి లేత కిరణాలు లక్ష్మీచెన్నకేశవస్వామి మూలవిరాట్‌ని తాకే దృశ్యాన్ని భక్తులు తిలకించాలని వారు కోరారు.

టీడీపీని గెలిపించాలి


30వ వార్డులో ప్రచారం చేస్తున్న కందికుట యశోదాదేవి

కదిరి, మార్చి 14: రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరుతూ మాజీ ఎమ్మె ల్యే కందికుంట వెంకటప్రసాద్ సతీమణి, ఆ పార్టీ నియోజవకర్గ వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట యశోదాదేవి కోరారు. పట్టణంలోని 30వ వార్డులో గురువారం ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో టీడీపీని అత్యధిక మోజార్టీతో గెలిపించాలన్నారు. చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఆమె వెంట నాయకులు మేకల వెంకటరమణ, కమల, పర్వీన్‌భాను, డైమండ్ ఇర్షాన్‌తోపాటు కార్యకర్తలు ఉన్నారు.

ఉద్యాన పంటలతో అధిక లాభాలు

మడకశిర రూరల్ మార్చి 14: ఉద్యాన పంటల సాగుతో రైతులకు అధికలాభాలు వస్తాయని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ పేర్కొన్నారు. మనగ్రామం మన విశ్వవిద్యాలయం కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం దత్తత గ్రామమైన గంగుళవాయిపాళ్యంలో పర్యటించారు. గ్రామంలో సాగు చేసిన పూల తోటలు, వక్కతోటలను పరిశీలించారు. ఉద్యాన పంటల సాగులో మెళకువలు, పంటలు సాగువల్ల వచ్చే లాభాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

● పోలీసులు ఆలస్యంగా స్పందించారంటున్న ప్రజలు


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

పుట్టపర్తి, మార్చి 14: చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అర్బన్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. అనంతరం వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై స్థానికులు స్పందిస్తూ చిత్రావతి నది ఖాళీ అయిన తరువాత పోలీసులు స్పందించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఇసుక తరలింపు ప్రారంభమైనప్పుడే ఈ చర్యలు తీసుకొని ఉండుంటే నది ఖాళీ అయ్యేది కాదన్నారు. ఇప్పుడు ఇసుక అంతా అయిపోయాక చర్యలు తీసుకుని ఏం లాభం అంటూ పెదవి విరుస్తున్నారు. మొదట్లోనే ఇసుక అక్రమ తరలింపుపై ప్రతిపక్ష పార్టీల నాయకులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారని, అప్పుడు స్పందించని అధికారులు, పోలీసులు ఇప్పుడెందుకు హడావుడి చేస్తున్నారోనని దుయ్యబట్టారు.

గ్రామాల్లో గోనుగుంట్ల పర్యటన

● చిల్లవారిపల్లిలో కాటకోటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

తాడిమర్రి, మార్చి 14: మండలంలోని చిల్లవారిపల్లి, దాడితోట, నాయనపల్లి, చిల్లకొండయ్యపల్లి గ్రామాల్లో బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ గురువారం పర్యటించారు. తొలుత చిల్లవారిపల్లికి వెళ్లి కాటకోటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చిల్లవారిపల్లి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ప్రస్తావించారు. రాబోవు ఎన్నికలలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా తాను బరిలోకి దిగుతున్నానని, అందరూ సహకరించి తన విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సారి తాను ఎమ్మెల్యేగా గెలుపొందితే వెంటనే చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి పార్నపల్లి యేటికి నీరు ఇచ్చే విధంగా జీఓ తెస్తానన్నారు. అలాగే కాట కోటేశ్వరాలయ అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయించేందుకు కృషిచేస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ ఉన్న రోడ్లను పూర్తిస్థాయిలో కనిపించేలా చర్యలు చేపడతానన్నారు. రాబోయేది టీడీపీ, బీజేపీ, జనసేనల కూటమి ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. అభిమానులు గజమాలలతో సత్కరించి పూలవర్షం కురిపించారు. తర్వాత ఆయన దాడితోట, నాయనపల్లి, చిల్లకొండయ్యపల్లి గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో నాయకులు రఘురాంచౌదరి, ఆదినారాయణ, రామానాయుడు, శేషాద్రినాయుడు, వెంకటేశ్, అశ్వర్థనారాయణ, జేసీబీరామకృష్ణ, పొడమల మంజునాథ్, మర్తాటి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


చిల్లవారిపల్లిలో గోనుగుంట్లను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

ఓబుళదేవరచెరువు, మార్చి 14: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని, అప్పుడే నిజమైన అభివృద్ధి అని ఎంపీపీ తుమ్మల పర్వీన్ షామీర్ పేర్కొన్నారు. మండలంలోని వడ్డివారిపల్లిలోగల పల్లవి మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులతో పాటు సమానంగా మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసిన మదర్ థెరీసా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ అర్చన, జిల్లా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు పుట్టా ఈశ్వరమ్మ, మండలాధ్యక్షురాలు వెంకటలక్ష్మి, కార్యదర్శి లక్ష్మీదేవి, కోశాధికారి శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, ఎంపీఎం రమణప్ప, మహిళాసంఘం సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

'మహిళలకు పెద్దపీట వేస్తున్న టీడీపీ'

కదిరిఅర్బన్, మార్చి 14: తెలుగుదేశం పార్టీ మహిళలకు పెద్ద పీట వేస్తున్నట్లు ఆపార్టీ జిల్లా అధికార ప్రాతినిధి వల్లెపు సోమశేఖర్ గురువారం ఓప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి మహిళలకు పెద్దపీట వేస్తూ ప్రాధాన్యత కల్పించడంలో టీడీపీ ముందుందన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. తాజాగా ఎమ్మెల్యే టికెట్లను జిల్లాలో ఇద్దరు మహిళకు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. కదిరి అభ్యర్థిత్వం కందికుంట యశోదాదేవి, పుట్టపర్తి అభ్యర్థిత్వం పల్లె సింధూరకు కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. బీసీలకు, మహిళలకు ప్రాధాన్యతనిస్తున్న టీడీపీని బలపరచాలని ఆయన ప్రజల్ని కోరారు.

నాటుసారా స్వాధీనం

కదిరిఅర్బన్, మార్చి 14: మండలంలోని సున్నపుగుట్ట తండాకు చెందిన రాములునాయక్ గురువారం నాటుసారా విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ మోహన్ తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు గ్రామంలో దాడులు నిర్వహించామని, నాటుసారా అమ్ముతున్న రాములునాయక్‌నుంచి మూడులీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, అతన్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

ఏపీఎంగా రవీంద్ర బాధ్యతలు

నల్లచెరువు, మార్చి 14: మండలకేంద్రంలోని వెలుగు కార్యాలయంలో నూతన ఏపీఎంగా రవీంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. కదిరి వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా పనిచేస్తున్న ఇతను బదిలీపై నల్లచెరువుకు వచ్చారు. ఇక్కడి ఏపీఎం రమణమ్మ బదిలీపై కదిరికి వెళ్లారు. నూతన ఏపీఎం మాట్లాడుతూ.. సంఘాల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

రుణాలు రెన్యూవల్ చేయండి

నల్లమాడ, మార్చి 14: మండలకేంద్రంలోని సహకార బ్యాంకులో రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని సీఈఓ కేశవులు సూచించారు. రైతులు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలన్నారు. సకాలంలో రెన్యూవల్ చేసుకుంటే ప్రభుత్వంనుంచి వచ్చే రాయితీలు వర్తిస్తాయన్నారు. వన్‌బీ అడంగల్, ఆధార్ జిరాక్సులతో పాటు రెండు పాస్‌ఫొటోలు అందించాలన్నారు. ఈనెల చివరిలోపు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగనన్న లేఔట్‌లో అవినీతిపై విచారణ జరపాలి

కొత్తచెరువు, మార్చి 14: మండల కేంద్రంలోని జగనన్న లేఔట్‌లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి పేదలకు న్యాయం చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని అస్లాం సప్లయర్స్‌లో గురువారం టీడీపీ నాయకులు విలేకరు సమావేశంలో మాట్లాడారు. స్థానిక ధర్మవరం రహదారిలోని 384 సర్వేనెంబర్‌లో గల జగనన్న లేఔట్‌లో రెవెన్యూ అధికారులు వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు ఇష్టానుసారంగా పట్టాలు మంజూరుచేశారన్నారు. అర్హులైన పేదలకు కాకుండా అధికార పార్టీ వారికి కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. ముఖ్యంగా 22మందికి ఇళ్లపట్టాలు రాకనే అధికారులు పునాదులు తీసుకోమని చెబుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. అర్హులకు పట్టాలు ఇవ్వకుండా అధికార పార్టీ నాయకులకు మాత్రం పట్టాలు ఇవ్వడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. వైసీపీ నాయకులు చేస్తున్న ఆగడాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చేఎన్నికలలో ప్రజలే గుణపాఠం చెబుతారని అన్నారు. అధికారులు ప్రజలకు న్యాయం చేయకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల,పట్టణ కన్వీనర్‌లు రామకృష్ణ, ఒలిపి శీన, నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, వెంకటేశ్, రాహుల్, పెద్దన్న, అస్లాం, డ్రైవర్ కేశప్ప, మనోహర్, రవి, రఘు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

కదిరిఅర్బన్, మార్చి 14: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో గురువారం పట్టణంలో పోలీసులు కవాతు నిర్వహించారు. నిజాం వలీ కాలనీలో ఈ కార్యక్రమం చేపట్టారు. వచ్చే ఎన్నిక ల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించునేలా చేసేందుకు, ఇం దుకు వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు కవాతు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


నిజాంవలీ కాలనీలో కవాతు చేస్తున్న పోలీసులు

ముందస్తు అడ్మిషన్లకు అడ్డుకట్ట వేయండి


విద్యాశాఖ ఏడీ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కొత్తచెరువు, మార్చి 14: జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ముందస్తుగా అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించాయని, వాటికి అడ్డుకట్ట వేయాలంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం మండలకేంద్రంలో విద్యాశాఖ ఏడీ-1 నాగరాజును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లను ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రారంభించాయన్నారు. ఇందుకు వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలను బహిరంగంగా ఏర్పాటు చేశారన్నారు. కావున వాటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాహక్కుచట్టానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజుల పట్టికను నోటీసు బోర్డులో ఉంచలేదని, అలాంటి పాఠశాలలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, నాయకులు బాబ్జాన్, వీరేశ్, హర్షకుమార్, భగత్, హరీశ్ పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

ధర్మవరం, మార్చి 14: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం పట్టణంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రధాన వీధుల్లో బైకు ర్యాలీ చేపట్టారు. తర్వాత చిలకం మధుసూదన్‌రెడ్డి దంపతులు తమ స్వగృహంలో కార్యకర్తల నడుమ కేక్‌కట్ చేశారు.

కొత్తచెరువు: మండల కేంద్రంలోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని జనసైనికులు ఘనంగా జరిపారు. ముందుగా జనసేన పార్టీ జెండా విష్కరించి టీడీపీ, జనసేన,బీజేపీ ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినదించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో నా యకులు పూలశివప్రసాద్, గాజుల నాగేంద్ర, నల్లప్ప, నరేంద్రభూపతి, గంగావతి, ఓబిరెడ్డి, గూడామధు, శేఖర్, హనుమంత్‌నాయక్, రెడ్డప్ప, చిరంజీవి, గంగాద్రి, బాబు, నవీన్, రాజు,సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరంలో జనసేన జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాఠశాలల్లో వైభవంగా సరస్వతీ పూజ

నల్లచెరువు, మార్చి 14: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం సరస్వతీ పూజను వైభవంగా నిర్వహించారు. పది పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సరస్వతీ పూజ చేశారు. అనంతరం సరస్వతీదేవి విగ్రహదాత దాదెం శివారెడ్డికి సన్మానం చేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ పది విద్యార్థులు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అలాగే పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సూచనలు వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిరుపాల్, కుమార్, హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని సీవీజ్ఞాన సీబీఎస్ఈ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు సరస్వతీ పూజ చేశారు. ఈ సందర్భంగా సరస్వతీదేవి చిత్రపటం వద్ద హాల్ టిక్కెట్లు ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం కరస్పాండెంట్ కె. మస్తాన్ పరీక్ష సమయంలో విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నల్లచెరువు జడ్పీ హైస్కూల్లో సరస్వతీ పూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


ఓడీసీలో..

నేడు సాయికాళేశ్వర్ వర్ధంతి

● మెగా కంటివైద్యశిబిరం

పెనుకొండ, మార్చి 14 : ప్రముఖ ఆధ్యాత్మికవేత్త , శివసాయి మందిరం వ్యవస్థాపకులు డాక్టర్ సాయి కాళేశ్వర్ 12వ వర్ధంతిని శుక్రవారం షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు వారు గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కాళేశ్వర్ సమాధిని శుక్రవారం ఉదయం వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపడుతామన్నారు. వర్ధంతిని పురస్కరించుకుని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప ఆధ్వర్యంలో మెగా కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో నిర్వాహకులు విజయభాస్కర్ రెడ్డి, చిట్టిబాబు, హరీ, బాబు తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్లకు శిక్షణ

గోరంట్ల, మార్చి 14: పట్టణంలోని పశువైద్యశాలలో ప్రభుత్వం నూతనంగా నియమించిన పశుసంవర్ధకశాఖ సహాయకులతో ఏడీ శ్రీనివాసరావు గురువారం సమావేశం నిర్వహించారు. గోరంట్ల సబ్‌డివిజన్ పరిధిలోని గోరంట్ల, సోమందేపల్లి మండలాల వెటర్నరీ అసిస్టెంట్లు 17మంది పాల్గొన్నారు. మండలంలోని వానవోలు ఆసుపత్రి పరిధిలో ఏడుగురు, పాలసముద్రం పరిధిలో ఇద్దరు, సోమందేపల్లి పరిధిలో ఎనిమిది మంది సహాయకులు ఏర్పాటైనట్లు ఏడీ తెలిపారు. నారసింహపల్లి నుంచి నియమితు లైన వారు ఆసక్తి చూకపకోవడంతో కొత్త వారిని నియమించాల్సి ఉంది ఈనెల 15నుంచి 31వరకు సంబంధిత పశువైద్యశాలలో 17మందికి ప్రయోగాత్మక శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. హిందూపురం డివిజన్ ప్రధాన కార్యాలయంలో ఏప్రిల్ 1నుంచి 30 వరకు నెలరోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం మే 1నుంచి ఆగస్టు 15వరకు రెండోవిడత శిక్షణను పశువైద్యశాలలో నిర్వహిస్తారని తెలిపారు. శిక్షణ పూర్తయ్యాక పరీక్ష నిర్వహించి, అందులో ఉత్తీర్ణులైన వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణిస్తారని తెలిపారు. అనంతరం సంబంధిత ఆర్బీకేలలో వారు విధులు నిర్వహించాల్సి ఉంటుందని ఏడీ వివరించారు .

రైల్వే రోడ్డుకు కల్లూరు సుబ్బారావు పేరుపెట్టాలి

తహసీల్దార్‌కు కాంగ్రెస్ నాయకుడి వినతి

హిందూపురం అర్బన్, మార్చి 14: పట్టణంలోని 80 అడుగుల రైల్వే రోడ్డుకు స్వాతంత్ర్య సమరయోధుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత కల్లూరు సుబ్బారావు రోడ్డుగా నామకరణం చేయాలని ప్రముఖ వ్యాపార వేత్త కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎం హెచ్ ఇనయతుల్లా కోరారు. ఈ మేరకు గురువారం మునిసిపల్ కమిషనర్‌కు వినతి అందించారు. దేశం కోసం, ఈ ప్రాంతం కోసం, ఈ ప్రాంత ప్రజల అభివృద్ధికోసం పరితపించిన గొప్ప నాయకుడు కల్లూరు సుబ్బారావు అన్నారు. పట్టణంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పురం ఆసుపత్రికి పలువురు డాక్టర్లు

హిందూపురం అర్బన్, మార్చి 14: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా డాక్టర్ శివకుమార్ గురువారం చేరారు. ఆయన గోరంట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా, చిన్న పిల్లల వైద్యనిపుణులుగా విధులు నిర్వ హిస్తూ బదిలీపై హిందూపురం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి వచ్చారు. గతంలో ఇక్కడ పిడియాట్రిక్ విభాగంలో అసిస్టెంట్ సివిల్ సర్జన్‌గా పనిచేశారు. పెనుకొండలో విధులు నిర్వహిస్తున్న కంటి వైద్య నిపుణులు శివకుమార్‌స్వామి హిందూపురం ప్రభుత్వాసుపత్రికి బదిలీపై వచ్చారు. అనస్తీషియాగా లచ్చిరామ్‌నాయక్ పెనుకొండ నుంచి హిందూపురానికి బదిలీపై వచ్చారు. దీంతో హిందూపురం ఆసుపత్రి వైద్యుల కొరత తీరింది. వైద్యులు ఫుల్‌గా ఉండటంతో ఇక నుంచి అన్ని సౌకర్యాలతో పాటు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

అగళి, మార్చి 14 : మండల పరిధిలోని పీ బ్యాడిగెర పంచాయతీ వడగుంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పోషణ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సూపర్‌వైజర్ లీలావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సురేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, జయమ్మ, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో అధిక లాభాలు



పూలతోట పెంపకంపై వివరిస్తున్న ప్రిన్సిపాల్

మడకశిర రూరల్ మార్చి 14: ఉద్యాన పంటలసాగుతో రైతులకు అధికలాభాలు వస్తాయని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ పేర్కొన్నారు. మనగ్రామం మన విశ్వవిద్యాలయం కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం దత్తత గ్రామమైన గంగులవాయిపాళ్యంలో పర్యటించారు. గ్రామంలో సాగు చేసిన పూల తోటలు, వక్కతోటలను పరిశీలించారు. ఉద్యాన పంటల సాగులో మెళకువలు, పంటలు సాగువల్ల వచ్చే లాభాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, మార్చి 14: మండలంలోని వానవోలు గ్రామానికి చెందిన మహిళ సువర్ణ బుధవారం రా త్రి విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వానవోలుకు చెందిన రాజు భార్య సువర్ణ విషద్రావకం ద్రావకం తాగి అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబసభ్యులు ప్రత్యేకవాహనంలో రాత్రికి రాత్రే గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు అందించారు. ఆమెను గురువారం తెల్లవారు జామున మెరుగైన చికిత్సకోసం 108 వాహనంలో హిందూపురం తరలించారు. కుటుంబ కలహాల కారణంగా ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది.

ఇద్దరు మంత్రులైనా.. అటకెక్కిన పట్టణాభివృద్ధి

వైసీపీ పాలనపై టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత విమర్శ



పట్టణంలో ఏమాత్రం అభివృద్ధి జరగలేదంటూ చూపుతున్న సవిత

పెనుకొండ టౌన్, మార్చి 14 : పెనుకొండ నియోజకవర్గానికి ఈ ఐదేళ్లలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు మంత్రులు ప్రాతినిధ్యం వహించారు. అయినా పెనుకొండ పట్టాణాభివృద్ధిని అటకెక్కించారని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి సవిత విమర్శించారు. పట్టణంలో ఏ ఒక్క అభివృద్ధి చేసిన పాపనపోలేదన్నారు. ఆమె గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా జనసేన, టీడీపీ శ్రేణులతో కలిసి పట్టణంలోని మారుతినగర్, బీటీఆర్ కాలనీ, శ్రీరాములయ్య కాలనీలో జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు, మినీ మేనిఫెస్టో గురించి సవిత ఓటర్లకు వివరించారు. 'నేను లోకల్' అనే నినాదంతో ముందుకెళ్లారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పెనుకొండ ఎమ్మెల్యేగా గెలిచిన శంకర్‌నారాయణ మంత్రిగా పనిచేశారని, అనంతరం కళ్యాణదుర్గం నుంచి ఇక్కడకు వచ్చిన ఉష ప్రస్తుతం మంత్రి అన్నారు. అయినా పెనుకొండ పట్టణ ప్రజల సమస్యలు వారికి పట్టవన్నారు. దోచుకోవడమే వారి ప్రధాన లక్ష్యమని ఎద్దేవ చేశారు. వైసీపీ ప్రభుత్వ నిర్వాకం చాలా గ్రామాల్లో నిధులు లేక చిన్న చిన్న పనులు చేయలేక పోయారన్నారు. దీంతో గ్రామాలు చాలా అధ్వానంగా తయారయ్యాయని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి జనసేన, టీడీపీ కూటమితో చంద్రబాబును ముఖ్యమంత్రి చేద్దామన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన చేస్తున్న వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయన్నారు. రాష్ట్రంలోనే బడుగు బలహీనవర్గాల అభ్యున్నతే టీడీపీ ధ్యేయమని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో మునిమడుగు చిన్న వెంకటరాముడు, త్రివేంద్ర, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, మైనార్టీనాయుడు దాదు, ఆర్యవైశ్య సంఘం నాయకులు నంజప్ప తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే గ్రామాభివృద్ధి

పెనుకొండ టౌన్(సోమందేపల్లి) : టీడీపీ హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందంటూ కాలర్ ఎగురవేసుకుని చెప్పండని ఎమ్మెల్యే అభ్యర్థి సవిత టీడీపీ నాయకులతో పేర్కొన్నారు. సోమందేపల్లిలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో ఆమె గురువారం మండల విస్తృస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... ఎన్నికల సమయం తక్కువగా ఉందని కలిసికట్టుగా అందరం పనిచేయాలని సూచించారు. ఈ అరాచక, దోపిడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. అలాగే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనదే అన్నారు. రెండేళ్లుగా మంత్రిగా ఉన్న ఉషా... ఎన్ని చెరువులకు నీరందించావ్, ఎన్ని ఉద్యోగాలు ఇప్పించావ్, ఏం అభివృద్ధి చేశావని ప్రశ్నించారు. దీనిపై చర్చకు తాము సిద్ధమన్నారు. ఏది ఏమైనా మంత్రి ఉష ఓ వలస పక్షి అని, తాను ఇక్కడే పుట్టి పెరిగిన పక్కా లోకల్ అన్నారు.

ఆధార్ నమోదుకు సర్వర్ సమస్య

మూడు రోజులుగా పడిగాపులు కాస్తున్న చిన్నారులు, మహిళలు

పెనుకొండ రూరల్, మార్చి14 : సర్వర్ సమస్య తలెత్తడంతో నూతన ఆధార్ నమోదుతో పాటు ఆధార్ కార్డులో పేర్లు తదితరాల మార్పులు, చేర్పుల కోసం వచ్చిన చిన్నారులు, మహిళలు పడిగాపులు కాయాల్సి వస్తోంది. పెనుకొండలోని ఆంధ్రబ్యాంకు, సచివాలయం-3లోని ఆధార్ కేంద్రాల్లో పేర్ల మార్పులు, చేర్పుల కోసం వెసలుబాటు కల్పించారు. అయితే మూడు రోజుల నుంచి సర్వర్ పనిచేయక పోవడంతో మహిళలు, చిన్నారుల అవస్థలు వర్ణనాతీతం. వైసీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయంలోనూ సర్వర్ సమస్య తలెత్తడంతో చిన్నపిల్లలను ఎత్తుకొని ఎండలో పడిగాపులు కాయాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పెనుకొండ సచివాలయం -3లో పడిగాపులు కాస్తున్న మహిళలు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశా

సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

మడకశిర, మార్చి14 : నియోజకవర్గం అభివృద్ధి చేయడానికి తాను ఎనలేని కృషి చేశానని సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి పేర్కొన్నారు. ఆయన గురు వారం ముఖ్యఅతిథిగా హాజరై పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించారు. అనంతరం పార్టీ ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించి, ఎన్నికల ప్రచారంపై చర్చించారు. అనంతరం రఘువీరారెడ్డి మాటాడుతూ... జాతీయ పార్టీ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో నియోజకవర్గం అభివృద్ధికి తాను ఎనలేని కృషి చేశానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జీడిపల్లి వరకు సాగు నీరు తీసుకొచ్చినప్పుడు... రఘువీరారెడ్డి ఆంధ్రాకు కృష్ణా నీటిని తరలించుకెళ్తున్నాడని తెలంగాణ నాయకుడు కేసీఆర్ తనపై ఆరోపణ చేశా రన్నారు. రైతుల కోసం ఎలాంటి ఆరోపణలకైనా సిద్ధమన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ప్రసరంగించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంజూనాథ్, బయపరెడ్డి, డాక్టర్ రవిశంకర్, మండలపల్లి నాగరాజు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏపీ స్టేట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి



పర్యావరణం గురించి విద్యార్థులకు వివరిస్తున్న అధికారి ప్రభావతి

హిందూపురం అర్బన్, మార్చి 14: చెట్లుంటేనే క్షేమం... లేకుంటే క్షామం అని ఏపీ స్టేట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి ప్రభావతి పేర్కొన్నారు. ఆమె గురువారం హిందూపురంలోని దీప్తి, వేళాంకిని, వివేకానంద మిలి యనీయం, ఈశ్వర్, పాం చ్ జ న్యా పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ... దేశంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలంటే ప్రకృతి అందాలైన చెట్ల ప్రాముఖ్యం ఎక్కువగా ఉంటుందన్నారు. పర్యావరణం గురించి విద్యార్థులకు వివరించారు. చెట్లు లేక పోతే వర్షాలు కురవవని, వర్షాలు కురవకపోతే నీటికి ఇబ్బంది కలుగుతుందన్నారు. జీవకోటికి నీరే ప్రాణాధారమన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడకం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లు గంగప్ప, ప్రసన్న లక్ష్మి, ఎన్‌జీసీ కో ఆర్డినేటర్ రామలింగయ్య తదితరులు ఉన్నారు.

పవర్‌లూమ్స్ కార్మికులకు ఇళ్ల స్థలాలివ్వాలి

సీపీఐ నాయకుల డిమాండ్



గోరంట్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద పవర్‌లూమ్స్ కార్మికుల ధర్నా

గోరంట్ల, మార్చి 14: పవర్‌లూమ్స్ కార్మికులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో పవర్‌లూమ్స్ కార్మికులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి సుధాకర్ తదితరులు మాట్లాడుతూ... గోరంట్లలోని చౌడేశ్వరీకాలనీ, తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న పవర్‌లూమ్స్ కార్మికులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా ఫలితంలేదని ఆవేదన చెందారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పవర్‌లుమ్స్ కార్మికులకు ఇళ్లస్థలాలు మంజూరు చేసి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తహసీల్దార్ అక్బల్‌బాషాకు వారు వినతిపత్రం అందించారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి సురేష్, పవర్‌లూమ్స్ కార్మిక సంఘం నాయకులు రామక్రిష్ణ, వెంకటేష్, మనోహర్, శ్రీనివాసులు, మేస్త్రీ శ్రీనివాసులు, శంకర్, మహేష్, ఈశ్వరయ్య, బాబు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పట్టాలు సాధించుకుందాం

లేపాక్షి : ఇళ్లులేని నిరుపేదలు ప్రభుత్వంతో పోరాటం చేసి ఇళ్ల పట్టాలు సాధించుకుందామని సీపీఐ మండల కార్యదర్శి శివప్ప అన్నారు. ఇళ్లులేని నిరుపేదలు సీపీఐ నాయకులతో కలిసి మండలంలోని లేపాక్షి - కంచి సముద్రం ప్రధాన రహదారిలో సర్వేనంబరు 358, 361లో ఉన్న ప్రభుత్వ భూమిలో గురువారం ఉదయం జెండాలు పాతారు. ఈ సందర్భంగా శివప్ప మాట్లాడుతూ... ఇళ్లులేని నిరుపేదల కోసం తహసీల్దార్ కార్యాల యం చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదన్నారు. దీంతో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి అందులో ఇళ్లు నిర్మించడమే సీపీఐ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఇళ్లులేని నిరుపేదలు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీటీడీ అధికారి మృతి

పావగడ, మార్చి 14: తిరుమల తిరుపతి దేవస్థానంలో దేవదాయ శాఖ అధికారిగా పనిచేస్తున్న పావగడ తాలూకా కోటగుడ్డం గ్రామానికి చెందిన శ్రీనివాస్(49) గుండెపోటుతో గురువారం ఉదయం మృతి చెందారు. దాదాపు 10 సంవత్సరాలుగా తిరుపతి, శ్రీశైలంలో దేవదాయ శాఖ అధికారిగా పనిచేస్తున్న ఆయన భక్తులకు దేవాలయ సౌకర్యాలు అందించడంలో అందరిమన్ననలు పొందారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన అంత్యక్రియలు గురువారం స్వగ్రామమైన కోటగుడ్డంలో ముగిశాయి.

మద్యం మత్తులో డ్రైవింగ్

- ప్రమాదాలకు కారణమవుతున్న వైనం
- యువకులే అధికం
- అరికట్టలేకపోతున్న పోలీసు తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు

చిలమత్తూరు, మార్చి 14 : మద్యం మత్తులో యువత వాహనాలు నడుపుతూ రోడ్లపై నానా వీరంగం సృష్టిస్తున్నారు. పోలీసులకు అడ్డంగా దొరికి పలువురు కేసుల పాలవుతున్నారు. కానీ మండలంలోని యువతలో మార్పు రావడంలేదు. మండలంలో గత సంవత్సరం 74 వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో అత్యధికంగా యువకులే ఉండటం విశేషం. ప్రధానంగా మండలానికి సరిహద్దుగా ఉన్న కర్ణాటకలోని బాగేపల్లిలో మద్యం తాగి వస్తూ కొడికొండ చెక్‌పోస్టులో పోలీసులకు పట్టుబ డుతున్నారు. స్నేహితులతో కలిసి పార్టీలు చేసుకుని, మద్యం తాగి ద్విచక్రవాహనాలను నడుపుతూ ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రమాదాలకు కారణమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మద్యం తాగడంతో పాటు వాహనాలను పరిమితికి మించి వేగంగా నడపడం, ఎదురుగా వస్తున్న వారిని, రోడ్డు దాటుతున్న వారిని గమనించకుండా దూసుకుపోవడం వంటి వాటితో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు విమర్శలున్నాయి.



కొడికొండ చెక్‌పోస్టులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

మద్యం ప్రియులకు కేరాఫ్ టీబీ క్రాస్ హైవే

మద్యానికి అలవాటు పడిన వారు కర్ణాటకలోని బాగేపల్లి వద్ద టీబీ క్రాస్ హైవే డాబాలకు వెళుతున్నారు. అక్కడ పీకల దాకా మద్యం తాగి, ఆ మత్తులోనే వాహనాలు నడుతూ ఇళ్లకు అతికష్టం మీద చేరుకుంటున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదాలకు కారణమవుతున్నారు. కర్ణాటకలో మద్యం ధరలు కొంతవరకు ఏపీలో కంటే తక్కువ. అంతేగాకుండా టీబీ క్రాస్ హైవేలో ఉన్న మద్యం దుకాణాల్లో కోరిన మద్యం బ్రాండ్లు దొరుకుతున్నాయి. దీంతోపాటు మద్యంతాగడానికి అనుగుణంగా అక్కడ డాబాలు ఉంటున్నాయి. అర్ధరాత్రి వరకు తాగినా అక్కడి పోలీసులు చర్యలు తీసుకోరు. దీంతో మద్యం ప్రియులకు టీబీ క్రాస్ హైవే కేరాఫ్‌గా మారింది.

తనిఖీలు చేస్తున్నా తగ్గని మందుబాబుల జోరు

కర్ణాటక నుంచి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని కట్టడి చేసేందుకు స్థానిక పోలీసులు ఇటీవల రోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కొడికొండ చెక్ పోస్టులో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఊగుతూ వాహనాలను నడుపుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. అయినా మ ద్యం బాబుల తీరు షరా మామూలైపోయింది. తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవుతారని పోలీసులు ఎంత అవగాహన కల్పించినా వృథానే అవుతోంది. కేవలం చిన్న చిన్న జరిమానాలతో సరిపుచ్చుతుంటుండటంతో మద్యం ప్రియుల్లో భయం లేకుండా పోతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మద్యంతాగి వాహనాలు నడపకండి



మద్యంతాగి వాహనాలు నడపడం ద్వారా అమాయకులు కూడా ప్రాణాలు కోల్పోతారు. వాహన చట్టం ప్రకారం మద్యంతాగి వాహనాలు నడపడం నేరం. అటువంటి వారిపై కేసులు నమోదు చేసి జైలులు పంపుతున్నాం. కుటుంబ సభ్యుల గురించి ఆలోచించేవారు ఎవరూ మద్యం తాగి వాహనాలు నడపరు. వారు చేసే తప్పు కారణంగా ప్రమాదాలు జరిగి జీవితాంతం అంగవైకల్యం పొందడం, లేదా ప్రాణాలు కోల్పోయి కుటుంబ సభ్యులు అనాథలయ్యేందుకు అవకాశం ఉంది.

- గంగాధర్, ఎస్ఐ, చిలమత్తూరు

బాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు : టీడీపీ



పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతున్న సునీల్ కుమార్, ఈరన్న

మడకశిర రూరల్, మార్చి 14 : రాష్ట్రాభివృద్ధి చంద్రబాబునాయుడితోనే సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్, మాజీఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న పేర్కొన్నారు. మండలంలోని బుళ్లసముద్రం కేంద్రంలో గురువారం రాత్రి టీడీపీ మాజీ సర్పంచులు , ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు , జనసేన పార్టీ నాయకులతో కలిసి చర్చించారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు ప్రజలోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని కోరారు. మాజీ ఎంపీపీ అశ్వత్థామప్ప, మాజీ సర్పంచులు జైపాల్, సంజీవప్పమాజీ డీలర్ నర్సేగౌడ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



దాదిరెడ్డిపల్లితండాలో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు

చిలమత్తూరు, మార్చి 14: రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించారు. మండలంలోని వీరాపురం పంచాయతీలో గురువారం యూనిట్ ఇన్‌చార్జ్‌లు రవీంద్రారెడ్డి, గంగప్ప, నాయకులు నంజిరెడ్డి, సోమశేఖర్, రవీంద్రా నాయక్, గోపీనాయక్, చంద్రా నాయక్ తదితరులు దాదిరెడ్డిపల్లి, దాదిరెడ్డిపల్లి తండా, హుసేన్‌పురం గ్రామాల్లో పర్య టించారు. ఈ సందర్భంగా 2024లో టీడీపీ అధికారంలోకి వస్తే అమలేచేసేబాబు ష్యూరిటీ, సూపర్ సిక్స్ పథకాలు, మినీ మేనిఫెస్టో గురించి ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. నాయకులు మల్లికార్జున నారాయణప్ప, శ్రీరామప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్‌చేస్తున్న సవిత, టీడీపీ, జనసేన నాయకులు

పెనుకొండ టౌన్, మార్చి 14 : జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు లోకేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మిట్ట ఆంజనేయ స్వామి కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో టీడీపీ, జనసేన నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె కేక్‌కట్‌చేసి జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ టీడీపీ, జనసేన పొత్తుతో వైసీపీకి నూకలు చెల్లాయన్నారు. జనసేన సైనికులు అధికార పార్టీ వైసీపీ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ ఉమ్మడి అనంత జిల్లా కార్యదర్శి సురేష్, సంయుక్త కార్యదర్శి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్లలో పోలీసుల కవాతు



గోరంట్లలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గోరంట్ల, మార్చి 14: సార్వత్రిక ఎన్నికలు త్వరలో నిర్వహిస్తుండడంతో పట్టణంలోని ప్రధాన వీధుల్లో పోలీసులు గురువారం కవాతు నిర్వహించారు. పెనుకొండ డీ ఎస్పీ బాజీజాన్‌సైదా, బీఎస్ఎఫ్ డీఎస్పీ ఆర్థోఅధానీపీజో, సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, బీఎస్ఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించారు. మార్కెట్‌యార్డు వద్దనుంచి ప్రధాన రహదారి, బస్టాండ్ కూడలి మీదుగా ప్రభుత్వ ఆసుపత్రి వరకు ప్రదర్శనగా వెళ్లారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగడానికి ప్రజల్లో మనోధైర్యాన్ని పెపొందించేందుకు పోలీస్ కవాతు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాలాజీ, ఏఎస్ఐ మద్దిలేటి, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

లేపాక్షి, మార్చి 14 : మండలంలోని పులమతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎంఈఓ నాగరాజునాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి విజయాలు సాధించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు సమయపాలనతో చదువుతూ మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ సందర్శకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరులపై ఎంపీ అనుచిత వ్యాఖ్యలు తగదు

కర్ణాటక వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో నిరసన



తహసీల్దార్ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

పావగడ, మార్చి 14: ఉత్తర కన్నడ జిల్లా ఎంపీ అనంతకుమార్ హెగ్డే విలేకరులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను కర్ణాటక వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ నాయకులు ఖండించారు. ఈ మేరకు గురువారం పావగడ పట్టణంలో కర్ణాటక వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. బెంగళూరులో బుధవారం జరిగిన ఒక సభలో రాజకీయ నాయకులను ఏనుగులతో, విలేకరులను శునకాలతో పోల్చి ఎంపీ మాట్లాడటంపై కర్ణాటక వర్కింగ్ జర్నలిస్టుల సంఘం తాలూకా అధ్యక్షుడు హనుమంతరాయప్ప తీవ్రంగా ఖండించారు. ప్రజా ప్రభుత్వంలో నాలుగో స్తంభంగా పేరుగాంచిన మీడియా రంగాన్ని దూషించిన బీజేపీ ఎంపీ అనంత కుమార్ హెగ్డేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు యూనియన్ సభ్యులు తహసీల్దార్ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. విలేకరులపై వ్యాఖ్యలు చేసిన ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని సంఘం తాలూకా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు పేర్కొన్నారు.